క్లుప్తంగా

సేవలతోనే సంతృప్తి



అల్పాహారం చేస్తున్న నిరాశ్రయులు

విజయనగరం టౌన్: నిరాశ్రయులకు సేవలందించడంలోనే సంతృప్తి ఉంటుందని అక్కినేని ఫ్యాన్స్ టౌన్ ప్రెసిడెంట్ కంటుభుక్త దుర్గాప్రసాద్ అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు 100వ జయంతిని పురస్కరించుకుని జిల్లా అక్కినేని ఫ్యామిలీ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల భవనంలో శుక్రవారం కేక్ కట్ చేసి, వృద్ధులకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వారందరికీ అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో రామారావు, రామకృష్ణ, కిరణ్, సంతోష్, కుసుమంచి రామకృష్ణ, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

పెన్నులు, పండ్లు పంపిణీ



చెవిటి, మూగ విద్యార్థులకు పండ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న నాయకులు

విజయనగరం: దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు చెవిటి, మూగ విద్యార్థుల నడుమ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కేవీఎస్ బాబు ఆధ్వర్యంలో పేర్ల రామ్మూర్తిశెట్టి చెవిటి, మూగ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తీగల హరినాథ్, గుంటుబోయిన కూర్మారావుయాదవ్, పసుపులేటి గిరిబాబు, బోర జగ్గారావు, నానాజీ, గీతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను విజయవంతం చేయండి

● ఎంపీడీఓ గిరిబాల



మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల: మండల వ్యాప్తంగా ఈనెల 27న నిర్వహించనున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ జి. గిరిబాల పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, 2024 – 25 యాక్షన్ ప్లాన్ తయారీ కోసం ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు సభలు నిర్వహిస్తామన్నారు. ప్రజలంతా ఆయా గ్రామాల్లో నిర్వహించే సభల్లో పాల్గొని, అభివృద్ధి కోసం తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. అలాగే ఇదే విషయమై 28, 29 తేదీల్లో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహిస్తామన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

విజయనగరం ఫూల్‌బాగ్: తడి, పొడి చెత్త సేకరించి తరలించే స్వచ్ఛాంధ్ర క్లాప్ వెహికల్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ పార్క్ సమీపంలో నల్ల రిబ్బన్లు ధరించి డ్రైవర్లు శుక్రవారం విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30లోపు డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే 30 తర్వాత సమ్మె తప్పదన్నారు. కార్యక్రమంలో పి.రామకృష్ణ, బి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చింతలవలసలో అవగాహన ర్యాలీ



చింతలవలసలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

డెంకాడ: చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ వలంటీర్లు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ చింతలవలస గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. చుట్టుపక్కల గ్రామాల్లో కూడా కార్యక్రమాలు నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమేష్, యాంటీ ర్యాగింగ్ కన్వీనర్ సునీల్‌ప్రకాష్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ఎన్.షణ్ముఖరావు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారూ.. హామీల అమలెప్పుడు..?



అసంపూర్తిగా దర్శనమిస్తున్న అంబటి సత్రం - కొత్తపేట నీళ్ల ట్యాంక్ ప్రధాన రహదారి విస్తరణ పనులు

- అమలు కాని ఎన్నికల హామీలు
- అధికారిక కార్యక్రమాలు, సమీక్షలకే పరిమితం
- ప్రజా సమస్యలను పట్టించుకోని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు
- వంద రోజుల పాలనలో మాన్సాస్ ఆస్తుల పరిరక్షణకే ప్రాధాన్యం

విజయనగరం: నియోజకవర్గంలో తాగునీటి సమస్య ప్రధానంగా ఉంది. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటింటికీ కుళాయిలు మంజూరు చేస్తాం.. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా ట్యాంక్‌లను నిర్మించి ఇబ్బందులను తొలగిస్తాం .. గడిగెడ్డ జలాశయ నీటి సామర్థ్యం పెంచేందుకు శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడతాం.. విజయనగరం వాటర్ స్కీమ్ పనులు పూర్తి చేస్తాం.. ఇదీ ఎన్నికలకు ముందు విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు ప్రజలకు చేసిన వాగ్దానం. ఇదొక్కటే కాదు ఇంకా పదుల సంఖ్యలో హామీలు గుప్పించి ప్రజల ఓట్లతో విజయం సాధించారు. అయితే ఎన్నికల అనంతరం హామీల అమలుపై కనీసం దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం మినహా ప్రజా సమస్యలపై పట్టించుకున్న దాఖలాలు లేవు.

100 రోజుల్లో చేసిందేంటి..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయింది. అయితే ఇప్పటివరకు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవనే చెప్పాలి. ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు జిల్లా స్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహించి జిల్లాపై పట్టు సాధించే ప్రయత్నంలో ఉన్నారు. ఎన్నికల్లో కష్టపడి పని చేసిన క్యాడర్‌ను పట్టించుకోవడం లేదన్న విమర్శలు కూడా మూటగట్టుకుంటున్నారు. తన వ్యక్తిగత పీఏ అంతా తానై పాలన వ్యవహారాలు చూస్తుండగా.... కేవలం క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పార్టీలో ఏళ్లతరబడి ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం పని చేసిన నాయకులకు తగిన గౌరవం దక్కలేదంటూ వారంతా మదనపడుతున్నారు. అంతేకాకుండా తన తండ్రి, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న మాన్సాస్ ట్రస్ట్‌కు సంబంధించిన ఆస్తుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించడం గమనార్హం. ఇప్పటికే పలు భవనాలను అధికార యంత్రాంగం సహకారంతో తొలగించే చర్యలు చేపట్టారు.

అదితి గజపతిరాజు ఇచ్చిన హామీల్లో కొన్ని ప్రధానమైనవి

- విజయనగరం అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తాం.
- నగరం నడిబొడ్డున ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను పూర్తి చేస్తాం.
- ద్వారపూడి వద్ద ఏర్పాటు చేసిన సోలార్ పవర్‌ప్లాంట్‌ను పునరుద్ధరిస్తాం.
- పూర్తయిన కంటోన్మెంట్ రైల్వే అండర్‌పాస్ లైన్‌ను ప్రారంభిస్తాం.
- విజ్జి స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను పూర్తి చేస్తాం.
- మూతపడిన క్రీడా పాఠశాలను అందుబాటులోకి తీసుకువస్తాం.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అండగా నిలుస్తాం. ఆయా వర్గాల వారికి 50 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేస్తాం.
- 5 వేల కోట్లతో ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తాం.

రామతీర్థసాగర్ మాటేమిటి..?



అభివృద్ధికి నోచుకోని రామతీర్థసాగర్ రిజర్వాయర్ గట్టు

పూసపాటిరేగ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నెల్లిమర్ల నియోజకవర్గంలో యువతకు ఐటీ ఉద్యోగాలు కల్పిస్తామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఇచ్చిన హామీ నీటి మూటలుగానే మిగిలాయి. నియోజకవర్గానికి ఐటీ కంపెనీలు తీసుకువచ్చి ఉద్యోగాలు ఇస్తారనుకుంటే వంద రోజులవుతున్నా ఉద్యోగాల ఊసెత్తకపోవడంతో యువత మండిపడుతున్నారు. కుమిలిలో నిర్మాణ దశలో ఉన్న రామతీర్థసాగర్ రిజర్వాయర్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ కనీసం పట్టించుకోలేదు. నియోజకవర్గంలో 24,710 ఎకరాలకు సాగునీరు, విజయనగరానికి తాగునీరు అందిస్తామని ఇచ్చిన హామీలు కూడా నెరవేరలేదు. సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు కాని అమలు చేయలేక చేతులెత్తేసారు. జగన్ మోహన్‌రెడ్డి కేవలం సెంటున్నరలో అగ్గిపెట్టెలాంటి ఇళ్లు మంజూరు చేశారు... మేము అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికీ 3 సెంట్లు స్థలం ఇస్తామన్న హామీని కూడా నిలబెట్టుకోలేకపోయారు. నిరుద్యోగులకు భృతి, 50 సంవత్సరాలకే పింఛన్ల మాటలు నెరవేర్చకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మొక్కలను సంరక్షించండి

● మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు



వెల్‌నెస్ సెంటర్ వద్ద మొక్కలు నాటిన ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొండగుంపాంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. స్వచ్ఛ గ్రామాలను తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాల, ఈఓపీఆర్‌డీ సింహాద్రి, సర్పంచ్ పతివాడ అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలు మంజూరు చేయాలి



గురుకులంలో వంటలు పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులం వసతిగృహం శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉంది. అధికారులు స్పందించి వసతిగృహానికి నూతన భవనాలు మంజూరు చేయాలని సిబ్బంది అధికారులను కోరారు. గ్రామంలో శుక్రవారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.రాధిక, తహసీల్దార్ తాడ్డి గోవింద సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది పనితీరును, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం గురుకులాన్ని సందర్శించారు. సుమారు 500 మంది విద్యార్థులకు సరిపడా వసతి లేదని గుర్తించారు. అలాగే మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. అనంతరం కొప్పెర్ల ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకాబత్తుల సత్తిబాబు, ప్రజాప్రతినిధులు కర్రోతు బంగార్రాజు, మహంతి చిన్నంనాయుడు, ఎంపీజీ శంకరరావు, ఆకిరి ప్రసాదరావు, లంకలపల్లి రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ నగరం'



జమ్ము పార్కులో మొక్కలు నాటిన కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది

విజయనగరం: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న విజయనగరాన్ని స్వచ్ఛతా నగరంగా తీర్చిదిద్దేందుకు అందరి భాగస్వామ్యం అవసరమని కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి కె. సాంబమూర్తి పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జమ్ము ప్రాంతంలో గల కార్పొరేషన్ పార్కులో మొక్కలు నాటారు. అలాగే ఆనందగజపతి ఆడిటోరియం వద్ద సంపూర్ణ శ్రమదానం చేపట్టి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యానికి మొక్కలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆరో డివిజన్ కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, ఉద్యానశాఖాధికారి ఉమాభరణి, పారిశుద్ధ్య సిబ్బంది బాలకృష్ణ, అంజిబాబు, సాలెంరాజు, రామారావు, రామకృష్ణ, రవి శేఖర్, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

● ఎంపీడీఓ రాధిక



మత్స్యవానిపాలెంలో సామూహిక సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పూసపాటిరేగ : గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఎంపీడీఓ ఎం. రాధిక అన్నారు. మండలంలోని మత్స్యవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్య కార్యకర్తలు అందించిన సూచనలు, సలహాలను గర్భిణులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యవతి, కార్యకర్త ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ద్వారపూడి



కరెంట్ లేక ఆరుబయట ఉన్న యువత

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడి ప్రజలు గడిచిన పన్నెండు గంటల నుంచి చీకట్లోనే మగ్గుతున్నారు. ద్వారపూడిలో గడిచిన కొన్ని నెలలుగా జేఎల్‌ఎం పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలు తలెత్తడంతో ప్రజలు అంధకారంలో గడపాల్సి వస్తోంది. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు సరఫరా లేదు. గ్రామానికి జూనియర్ లైన్‌మన్ పోస్టు కేటాయించడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎంపీడీఓ చంద్రకళ



విజయనగరం రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రకళ

విజయనగరం రూరల్: సమస్యల నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రకళ అన్నారు. మండలంలోని రీమాపేటలో శుక్రవారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి అరుణకుమారితో కలిసి ఎంపీడీఓ, తదితరులు ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే తల్లిపేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సింగవరంలో..

డెంకాడ: గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించడానికే గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ప్రత్యేకాధికారి జమదగ్ని అన్నారు. మండలంలోని సింగవరంలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పరిస్థితులను అంచనా వేశారు. అనంతరం గ్రామసభ నిర్వహించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూపారాణి, తహసీల్దార్ పద్మావతి, ఎంపీటీసీ సభ్యుడు కంది చంద్రశేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కంది సూర్యనారాయణ, పతివాడ అప్పలనాయణ, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: సింగవరం గ్రామసభలో అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, ప్రత్యేకాధికారి జమదగ్ని

'సీతం'లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు



కోర్సుల ప్రారంభోత్సవంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సులను జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కోర్సులతో మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, మార్కెటింగ్, అకౌంటింగ్, మానవ వనరులు వంటి ప్రధాన వ్యాపార రంగాలపై సమగ్ర అవగాహన పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డీవీ రామమూర్తి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్. వరూధి, హెచ్ఓడీ డాక్టర్ రాధ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు..



ఇంటింటికీ ప్రచారం చేస్తున్న కార్పొరేషన్ అధికారులు

● మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: సంక్షోభంలోనూ సంక్షేమాన్ని అందించి, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని ఒకటో డివిజన్ సాకేటివీధిలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయనగరం రెండు చోట్ల అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. ఘోషా ఆస్పత్రిలో కూడా త్వరలో మరో అన్న క్యాంటీన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. విజయవాడ వరద బాధితులకు సాయం చేసేందుకు కార్పొరేషన్ తరఫున 150 మంది సిబ్బంది విధులు నిర్వహించారని చెప్పారు. సమావేశంలో టీపీఆర్‌ఓ సింహాచలం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'100 కోట్లు' సినిమాను ఆదరించండి



మాట్లాడుతున్న సినిమా నిర్మాత శ్రీనివాసరావు, తదితరులు

● నిర్మాత సాకివలస శ్రీను

పూసపాటిరేగ : '100 కోట్లు' సినిమాను ఆదరించాలని నిర్మాత సాకివలస శ్రీనువాసరావు కోరారు. శుక్రవారం స్థానిక సాయికృష్ణా థియేటర్ వద్ద 100 కోట్లు సినిమా రిలీజ్ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 5 కోట్ల రూపాయల వ్యయంతో ఈ సినిమా నిర్మించినట్లు తెలిపారు. నోట్ల రద్దు సమయంలో ప్రజలు పడిన ఇబ్బందులను తెరకెక్కిస్తూ 100 కోట్లు నామకరణంతో సినిమా తీసినట్లు తెలిపారు. ఆంధ్రా, తెలంగాణలో 200 థియేటర్లలో ఈ సినిమా రిలీజైనట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయికుడు పిన్నింటి వెంకటరమణ మాట్లాడుతూ... భోగాపురం మండలం మారుమూల పల్లెటూరు సాకివలసకు చెందిన వ్యక్తి సినిమా తీయడం ఆనందంగా ఉందన్నారు. చిన్న సినిమాలను ప్రేక్షకులు ఆదరించాలన్నారు. కార్యక్రమంలో వెంపడాం సర్పంచ్ పిన్నింటి కుమార్, ప్రజాప్రతినిధులు కొరటాన ప్రసాదరావు, వాళ్లె సత్యనారాయణ, వి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.